# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-08-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు .**

2. **తెలంగాణ వ్యాప్తంగా ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి తెలిపారు.**

3. **భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు.**

4. **ఆంధ్రప్రదేశ్‌లోని వైయస్సార్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికల కౌంటింగ్ మరికాసేపట్లో ప్రారంభంకానుంది.**

5. **దేశ విభజన సమయంలో జరిగిన విషాద సంఘటనలు, బాధలను గుర్తు చేసుకుంటూ ఈరోజును విభజన విషాద స్మృతి దినంగా జరుపుకుంటున్నాం.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలపై మంత్రులు, అధికారులతో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, వాతావరణ శాఖ సూచనల దృష్ట్యా రాష్ట్రంలో కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో వాగులు వంకల నుంచి వచ్చే ఆకస్మిక వరద ప్రవాహాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దిగువన ఉన్న ప్రాంతాలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని అన్నారు.

-------------------------

వర్ష ప్రభావ ప్రాంత ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత సూచించారు. భారీవర్షాల నేపథ్యంలో గుంటూరు జిల్లా తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యా లయం నుంచి కోస్తా జిల్లాల కలెక్టర్లు, అధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు అత్యవసర సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101లను సంప్రదించాలన్నారు. జిల్లాల్లోను కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్స్, చెట్లను వెంటనే తొలగిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.

మరో వైపు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ నుంచి నీటి పారుదల శాఖ అధికారులతో వర్షాల పరిస్థితులపై దృశ్య మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చెరువులు, కాల్వల పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి, కృష్ణా, గోదావరి నదులు, వాటిపై ఉన్న ప్రాజెక్టుల పరిస్థితిపై ఆరా తీశారు. నీటి పారుదల శాఖలో ఉన్నతాధికారులందరూ విధి నిర్వహణలో ఉండాలని, ఎవ్వరూ సెలవులు పెట్టవద్దని ఆదేశించారు. కాల్వలు, చెరువులు, ప్రాజెక్టుల నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అన్నారు.

---------------------------

గ్రీన్ ఎనర్జీ కారిడార్ గా ఆంధ్రప్రదేశ్ ను మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో విద్యుత్ ప్రాజెక్టులు, పెట్టుబడులు, విద్యుత్ ఛార్జీల తగ్గింపు వంటి అంశాలపై నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, వచ్చే రెండు మూడేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ వినియోగానికి అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. అలాగే కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగించి గ్రీన్ ఎనర్జీలో తక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేసే మార్గాలను అన్వేషించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

తెలంగాణ వ్యాప్తంగా ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రంలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, భూములకు భూధార్ నంబర్ల కేటాయింపునకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల కృష్ణానదికి వరద ఉధృతి పెరిగింది. దీంతో విజయవాడ ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద నీరు చేరుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటి దృష్ట్యా ప్రకాశం బ్యారేజీ నుంచి 39 గేట్లు పూర్తిగా, 31 గేట్లు ఎనిమిది అడుగుల మేం ఎత్తి 3 లక్షల 63 వేల 438 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు. మరోవైపు బుడమేరుకు వరదలు అంటూ వస్తున్న వదంతులను నమ్మవద్దని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలియజేస్తూ,

వాయిస్ 33 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని వైయస్సార్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికల కౌంటింగ్ కాసేపట్లో ప్రారంభంకానుంది. ఈ మేరకు ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. కడప రిమ్స్ సమీపంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ జాతీయ విశ్వవిద్యాలయంలో కౌంటింగ్ కేంద్రాన్ని

ఏర్పాటు చేశామని చెప్పారు. కౌంటింగ్ హాలులో అధికారులతో పాటు వివిధ రాజకీయ పార్టీల ఏజెంట్లు కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు.

---------------------------

దేశ విభజన సమయంలో జరిగిన విషాద సంఘటనలు బాధలను గుర్తు చేసుకుంటూ ప్రతి యేటా ఆగష్టు 14వ తేదీని విభజన విషాద స్మృతి దినంగా జరుపుకుంటున్నాం. దేశ విభజన బాధను ఎప్పటికీ మరిచిపోలేం. విద్వేషం, హింస కారణంగా లక్షలాది మంది నిర్వాసితులు కావడంతోపాటు, ప్రాణాలు కోల్పోయారు. వారి సంఘర్షణ, త్యాగాలను గుర్తు చేసుకుంటూ ఈరోజు విభజన విషాద స్మృతి దినంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఈగల్ చీఫ్ ఆకే. రవికృష్ణ వెల్లడించారు. విజయవాడలో మాదక ద్రవ్యాల నివారణపై నిన్న అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా “సే నో టూ డ్రగ్స్” ప్రచార పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో గంజాయి పంటను పూర్తిగా నిర్మూలించామని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కోసం విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేశామని తెలియజేస్తూ,

వాయిస్ 33 సెకన్లు

---------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ అల్పపీడనం రెండు రోజుల్లో వాయుగుండంగా మారే అవకాశముందని, దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న నాలుగు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి జి.లక్ష్మీ తెలియజేస్తూ,

వాయిస్ ..28 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ రానున్న నాలుగు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================